సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 12 । ఏప్రిల్ । 2023




రోగుల బాధ్యత వైద్యులదే
ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ వైద్యులకు సూచించారు. 8లో▸



ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి
పాత ఇబ్రహీంపట్నం అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. 8లో▸

'న్యాక్'కు అచీవ్‌మెంట్ అవార్డు
మాదాపూర్: మాదాపూర్‌లోని న్యాక్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకుంది. కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీఐడీసీ) విశ్వకర్మ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా న్యూఢిల్లీ ఐకార్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో నిర్మాణ నైపుణ్యం అభివృద్ధికి అచీవ్‌మెంట్ అవార్డును న్యాక్ సంస్థకు అందించారు. పార్లమెంటరీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఈఅవార్డును అందజేశారు.



న్యూస్‌రీల్

బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి మరువలేనిది

కలెక్టర్ హరీశ్



మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హరీశ్ తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిబా పూలే చేసిన కృషి మరువలేనిదని, నేటి తరం ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ హరీశ్ అన్నారు. మహాత్మా జ్యోతి బాపూలే 197వ జయంతి ఉత్సవాలను మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వివక్షకు వ్యతిరేకంగా సమాజం కోసం పోరాడిన బహుజన తత్వవేత్త, సామాజిక దార్శనికుడు పూలే అని కొనియాడారు. వర్ణ వివక్షను రూపుమాపడం కోసం, దళిత బహుజన మహిళా వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు మహోన్నతమైనవన్నారు. కుల, లింగ వివక్షకు తావు లేకుండా విద్య, సమానత్వం ద్వారానే సామాజిక, ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయనే జ్యోతిబాపూలే ఆలోచనా విధానాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావు, రెవెన్యూ అధికారి హరిప్రియ, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉదయభాస్కర్, బీసీ సంఘం నాయకులు గౌరిగె మల్లేశ్, రావుల జంగయ్య, బర్ల జగదీశ్, హరినారయణజీ, శేఖర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఈ.వెంకటేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ ఫీజుతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బ్యూటీషియన్‌కు మూడు నెలలకు రూ.1,500, 7వ తరగతి పాసై ఉండాలన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ మూడు నెలల కోర్సుకు రూ.1,500, 7వ తరగతి పాసై ఉండాలన్నారు. ఎంఎస్ ఆఫీస్ మూడు నెలలకు రూ.1,000, సీసీ టీవీ టెక్నీషియన్ మూడు నెలలకు గాను రూ.1,500, పదో తరగతి పాస్, ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల యువతీ, యువకులు శంషాబాద్ మున్సిపాలిటీ ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలోగానీ, 94409 46083 నంబర్‌లోగానీ సంప్రదించాలని సూచించారు.

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ప్రభాకర్

మొయినాబాద్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని కనకమామిడిలో మండల సమాఖ్య అధికారి రవీందర్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎలాంటి ఆర్థిక అవకతవకలు జరగకుండా ఉండాలంటే ప్రతి సభ్యురాలు వారు చెల్లించిన రుసుముల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ పేమెంట్‌ను వినియోగించుకోవాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. సభ్యులందరూ ఇన్సూరెన్స్ చేయించుకుంటే మేలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ భవాని, ఏపీఎం రవీందర్, సీసీ జంగయ్య, సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జలం.. పాతాళం

రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలాలు

- సెప్టెంబర్–అక్టోబర్ మధ్య మూడు మీటర్ల లోతునే ఆనవాళ్లు
- మార్చి చివరి నాటికి లోతుకు పడిపోయిన నీళ్లు
- పనిచేయని బోరు మోటార్లు.. ఎండిపోతున్న పంటలు
- అడ్డగోలుగా బోర్ల తవ్వకాలు.. వాల్టా చట్టానికి తూట్లు
- మచ్చుకైనా కనిపించని ఇంకుడు గుంతలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూగర్భజలాలు పాతాళానికి పడిపోయాయి. పగటి ఉష్ణోగ్రతలకు తోడు కాలువల నుంచి నీటి ప్రవాహం లేకపోవడం, సామర్థ్యానికి మించి బోరు తవ్వకాలు జరుపుతుండటం, ఎడాపెడా తోడేస్తుండటంతో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. సాధారణంగా సెప్టెంబర్–అక్టోబర్ నెలల్లో జిల్లాలోని మెజార్టీ ప్రాంతాల్లో మూడు మీటర్ల లోతునే నీటి ఆనవాళ్లు ఉండగా.. ప్రస్తుతం పది మీటర్లు దాటినా కనిపించడం లేదు. భూ పొరల్లో నీరు లేకపోవడంతో వ్యవసాయ బోర్లు పని చేయడం లేదు. బావులు, చెరువుల కింద వరి, ఇతర పంటలు నీరు లేక ఎండిపోతున్నాయి.

గ్రౌండ్ వాటర్ లెవల్స్ (మీటర్ల లోతులో..)

ఫిజోమీటర్ ఉన్న ప్రదేశం	2022 మార్చి	2023 మార్చి
అబ్దుల్లాపూర్‌మెట్	6.26	8.53
సరూర్‌నగర్	11.97	19.65
మంచాల	3.49	6.39
శంకర్‌పల్లి	11.52	12.12
తలకొండపల్లి	18.23	11.60
యాచారం	4.58	4.97
శంషాబాద్	9.29	9.44
షాబాద్	8.86	9.44
శేరిలింగంపల్లి	7.83	9.79
రాజేంద్రనగర్	10.00	10.86
నందిగామ	7.07	7.28
మహేశ్వరం	9.43	9.49
కడ్తాల్	10.24	10.28
ఇబ్రహీంపట్నం	9.28	10.65
హయత్‌నగర్	6.65	11.19
గండిపేట్	9.00	10.06
చౌదరిగూడ	10.43	11.37
బాలాపూర్	7.92	7.57


పట్టణ ప్రాంతాల్లో వేగంగా..

జిల్లాలో 68 ఫిజో మీటర్లు ఉన్నాయి. 2022 మార్చిలో జిల్లా వ్యాప్తంగా సగటు భూగర్భ నీటి మట్టం స్థాయి 8.60 మీటర్లు ఉండగా, 2023 మార్చి నాటికి 8.89 మీటర్ల లోతుకు పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి కొత్తగా తొమ్మిది మండలాల్లో నీటి లభ్యత మెరుగుపడగా, మరో 18 మండలాల్లో భూగర్భ జలమట్టం పాతాళానికి పడిపోయింది. మారుమూల గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే నగరానికి సమీపంలో ఉన్న పట్టణ ప్రాంతాల్లోనే భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. వీటికి సమీపంలో కొత్తగా అనేక కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలుస్తున్నాయి. నిర్మాణ సమయంలోనే కాదు ఆ తర్వాత కూడా అపార్ట్‌మెంట్‌వాసులు, వాణిజ్య సముదాయాలు భూగర్భజాలాలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, సరూర్‌నగర్, రాజేంద్రనగర్, శంషాబాద్, శేరిలింగంపల్లి మండలాల పరిధిలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. చెరువులు, కుంటలు, లోతట్టు ప్రాంతాల్లో వంద ఫీట్లలోపే నీరు సమృద్ధిగా లభిస్తుండగా, మరికొన్ని కొన్ని ప్రాంతాల్లో వెయ్యి ఫీట్లకుపైగా లోతు బోర్లు తవ్వుతున్నారు. అయినా చుక్క నీరు కూడా లభించని పరిస్థితి నెలకొంది.

❝ వేగంగా పడిపోతున్నాయి

గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల్లోనే నీటి వాడకం అధికంగా ఉంది. చెరువులు, కుంటలు కూడా చాలా తక్కువ. దీంతో ఆయా ప్రాంతాల్లో వేగంగా నీటి మట్టాలు పడిపోతున్నాయి. వాల్టా చట్టం ప్రకారం 350 నుంచి 400 ఫీట్ల లోతు వరకు బోరు తవ్వుకునేందుకు అనుమతి ఉంది. కానీ చాలామంది అనుమతి పొందకుండా నిపుణుల సూచనలు పాటించకుండా 1000 నుంచి 1,200 ఫీట్లు తవ్వుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో భూగర్భ నీటిమట్టం స్థాయి మరింత లోతుకు పడిపోతుండటానికి ఇదే ప్రధాన కారణం. నిర్మాణ సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవడం, వ్యవసాయ బావుల వద్ద పొలాల్లో చెక్ డ్యాంలు, వాన నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భ జలాలను కాపాడుకోవచ్చు. లేదంటే భవిష్యత్తులో నష్టాలు చవి చూడక తప్పని పరిస్థితి.

– రఘుపతిరెడ్డి, జిల్లా అధికారి, భూగర్భజల వనరులశాఖ



T20 జర్నీ!

మెగా టూరిస్ట్ హబ్‌గా ట్యాంక్ బండ్– నెక్లెస్ రోడ్

చార్మినార్.. గోల్కొండ కోట.. సాలార్‌జంగ్ మ్యూజియం.. సెవెన్ టూంబ్స్ (కుతుబ్‌షాహీ సమాధులు).. జూపార్క్.. చౌమహల్లా ప్యాలెస్.. ఇవే ఒకప్పుడు హైదరాబాద్ పర్యాటక చిరునామాలు. కాలక్రమేణా వీటితో పాటు అక్కడక్కడా మరి కొన్ని ఏర్పాటయ్యాయి. ఇప్పుడు ఏకంగా 10 కిలోమీటర్ల దూరంలోనే సుమారు 20కిపైగా ప్రదేశాలతో మెగా టూరిస్ట్ సర్కిల్‌గా రూపుదిద్దుకుంటోంది. ఒక్క రోజులోనే ఇవన్నీ చుట్టేసి రావొచ్చు. ఎలా వెళ్లినా తక్కువ బడ్జెట్‌తో ఒక రోజు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో హాయిగా గడిపేయొచ్చు. పర్యాటకుల కోలాహలానికి చిరునామాగా మారిన ట్యాంక్ బండ్ – నెక్లెస్ రోడ్‌పై ఓ లుక్కేద్దాం!

– సాక్షి, సిటీడెస్క్

- 10 కి.మీ దూరంలో 20 కిపైగా పర్యాటక ప్రదేశాలు
- దేనికదే ప్రత్యేకత.. ఒక్కోచోట ఒక్కో ఆహ్లాదం
- తక్కువ బడ్జెట్‌తో సింగిల్ డే జాలీ జర్నీ
- భిన్న రుచులకు కేరాఫ్‌గా నయా టూరిస్ట్ సర్కిల్
- భాగ్యనగర సిగలో విభిన్న అనుభూతుల నగ

ట్యాంక్‌బండ్.. టూరిస్ట్ హబ్

ట్యాంక్‌బండ్, బుద్ధ విగ్రహం, ఇందిరా పార్కు, స్నో వరల్డ్, మరో రెండురోజుల్లో ఆవిష్కరణ కానున్న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, అద్భుతంగా ఆవిష్కృతం కాబోతున్న రాష్ట్ర నూతన సచివాలయం, ప్రారంభానికి సిద్ధమైన అమరవీరుల స్మారకం, లుంబినీ పార్కు, ఎన్టీఆర్ గార్డెన్, ప్రసాద్ ఐమాక్స్, బిర్లా మందిర్, బిర్లా ప్లానెటోరియం, జల విహార్, థ్రిల్‌సిటీ, ఈట్ స్ట్రీట్, సంజీవయ్య పార్కు, పీవీ జ్ఞాన భూమి, జైపాల్‌రెడ్డి స్మృతి వనం, ఇందిరా పార్కు.. ఇలా సుమారు 20కి పైగా ప్రదేశాలు నేడు పర్యాటక ప్రాంతాలుగా విరాజిల్లుతున్నాయి. ఇవన్నీ పది కిలోమీటర్ల సర్కిల్‌లో ఉండడం విశేషం.

కొత్తందాల సమ్మేళనం

ఎప్పుడూ చూసే ట్యాంక్‌బండే కదా అనుకుంటే పొరపడినట్లే. పర్యాటకుల అభిరుచులకు అనుగుణంగా తనను తాను మార్చుకుంటోంది. కొత్తందాలతో కళకళలాడుతోంది. మిరుమిట్లుగొలిపే వెలుగుల్లో తథాగతుడు కనువిందు చేస్తున్నాడు. సండే ఫన్‌డే రోజున జరిగే సంగీత కార్యక్రమాలు ఆబాల గోపాలాన్ని అలరిస్తున్నాయి. ఇటీవలే ఏర్పాటు చేసిన నీటి ఫౌంటేన్లు జిగేల్‌మంటున్నాయి. స్నో వరల్డ్‌లో మంచు విన్యాసాలు చేయడం ఓ గొప్ప అనుభూతిగా నిలుస్తోంది. స్ట్రీట్‌ఫుడ్‌కు పెట్టింది పేరుగా మారింది. లగ్జరీ బోట్లలో వ్యక్తిగత పార్టీలు, రాత్రి వేళల్లో బర్త్‌డే పార్టీలకు కేరాఫ్‌గా మారింది. ఇక ఎన్టీఆర్ గార్డెన్‌లో అరుదైన బొన్సాయ్ మొక్కలు, ఆర్టిఫీషియల్ మర్రిచెట్టులోంచి రైలు ప్రయాణం, భయపెట్టించే హంటర్ హౌస్, అబ్బురపరిచే పూల వనాలు, వింటేజ్ కార్లలో స్నాక్స్, అత్యంత ఎత్తులో నెక్లెస్ రోడ్ అందాలను చూపించే జెయింట్ వీల్, అండర్ గ్రౌండ్‌లో ఆటలు, ఆకట్టుకునే బొమ్మలు, ఎడారి మొక్కలు, కళ్లముందు మ్యాజిక్ చేసే త్రీడీ షో.. ఇవన్నీ ఇప్పుడు ట్యాంక్ బండ్‌కు సమ్‌థింగ్ స్పెషల్. ప్రసాద్ ఐమాక్స్‌లో సినిమా, షాపింగ్, గేమింగ్, ఈటింగ్, జల్ విహార్‌లో రెయిన్ డ్యాన్స్, వాటర్ గేమ్స్‌తో ఫుల్ ఎంజాయ్ ఉంటుంది. థ్రిల్ సిటీలో ప్రమాదకరమైన ఆటలతో భయానకమైన వాతావరణంతో థ్రిల్లింగ్ అనుభూతిని పంచుతోంది. సంజీవయ్య పార్క్‌లో అనేక రంగులతో అలరించే రోస్ గార్డెన్, బటర్‌ఫ్లై పార్క్, అతిపెద్ద జాతీయ జెండా, డాగ్ పార్క్, సైక్లింగ్ క్లబ్ ఇలా ఎన్నో.. మరెన్నో విశేషాలకు వేదిక అయ్యింది.

నీరా కేఫ్

హుస్సేన్‌సాగర్ తీరం చెంత నెక్లెస్ రోడ్‌లో మరోకొత్త పర్యాటక కేంద్రం నీరా కేఫ్ సిద్ధమైంది.అతి త్వరలో ఇది అందుబాటులోకి రానుంది. తెలంగాణ రుచులందించే స్టాళ్లతోపాటు కల్లుగీత వృత్తికి అద్దం పట్టేలా దీన్ని నిర్మించారు. పై అంతస్తులో ఒక సమావేశ మందిరం, రెస్టారెంట్ ఉంటుంది. మరోవైపు ప్రస్తుతం లుంబినీ పార్కు వద్ద ఉన్న బోటింగ్ పాయింట్‌కు తోడుగా నీరా కేఫ్ వెనుకభాగంలో మరో బోటింగ్ పాయింట్‌ను కొత్తగా అందుబాటులోకి తెచ్చారు. నెక్లెస్‌రోడ్‌లో విహరించేవారు లుంబినీ పార్కు బోటు యూనిట్ వరకూ వెళ్లాల్సిన అవసరం లేదు. సాగర్‌కు దక్షిణం వైపు నుంచి కూడా ప్రయాణించడానికి వీలు కల్పించినట్లయింది.

ఇవి చేస్తే ఇంకా మేలు

- పర్యాటకుల సంఖ్యకు అనుగుణంగా రీఫ్రెష్‌మెంట్ సౌకర్యాలపై జీహెచ్ఎంసీ, టూరిజం విభాగం దృష్టి సారించాలి. ప్రధానంగా టాయిలెట్ల సంఖ్య పెంచాలి.
- మినీ మొబైల్ వ్యాన్‌లు, షటిల్ సర్వీస్‌లు పెడితే బావుంటుంది. రోజంతా తిరిగేందుకు ఆర్టీసీ తరహా సింగిల్ డే పాస్‌లు ఉంటే మేలు.
- మొబైల్ చార్జింగ్ పాయింట్లు, లాన్లలో కూర్చునేందుకు స్ట్రీట్ ఫర్నీచర్ అవసరం (ట్యాంక్‌బండ్, పీవీ మార్గ్ మినహా మరెక్కడా లేవు).
- షీ–టీంలను పెంచి, పోకిరీలు, ఆకతాయిల వేధింపులపై మరింత దృష్టి సారించాలి.
- రద్దీ వేళల్లో సందర్శకులతో ట్రాఫిక్ జాం అవుతోంది. వీకెండ్స్‌లో ట్యాంక్ బండ్ మాదిరిగానే హుస్సేన్ సాగర్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని నో వెహికిల్స్ జోన్‌గా మార్చాలి.

❝ ప్రతిరోజూ వెళ్లాలనిపిస్తోంది

15 ఏళ్ల క్రితం నగరానికి వచ్చాను. అప్పటికీ ఎప్పటికీఎంతగానో మారింది. ముంబై, బెంగళూరు నగరాల కంటే ఎక్కువగా పర్యాటక రంగం దూసుకెళుతోంది. ఒకప్పుడు ఈవెనింగ్ టైంలో ట్యాంక్‌బండ్‌కు వెళ్లి రెండు, మూడు గంటల పాటు ఎంజాయ్ చేసేవాడిని. లాస్ట్ వన్ ఇయర్‌లో ట్యాంక్‌బండ్ ఏరియాలో జరిగిన డెవలప్‌మెంట్‌కు వీకెండే కాదు ప్రతిరోజూ వెళ్లాలనిపిస్తోంది. సరికొత్తగా కనిపిస్తోంది,

– చక్రవర్తి, ఐటీ ఉద్యోగి, రాంనగర్

బడ్జెట్ ఫ్రెండ్లీ సిటీ

హైదరాబాద్ అనేది బడ్జెట్ ఫ్రెండ్లీ సిటీ . ఇతర నగరాల్లో అయితే పర్యాటక ప్రాంతాలు ఒకే దగ్గర ఉండవు. అదే మన సిటీలో ఒక్క ట్యాంక్ బండ్‌కు వస్తే చాలు బోలెడన్ని ప్లేస్‌లు. ఒక్క రోజులో అన్నీ చుట్టేసి రావచ్చు. ఎంటర్‌టైన్‌మెంట్ అందించే ప్రాంతాలే ఎక్కువ. ఫుల్ ఎంజాయ్ చేయొచ్చు. పైగా తక్కువ ఖర్చులో వీటన్నింటినీ ఒకేరోజులో చూడొచ్చు.

– శివాని సింగ్, ట్రావెలర్, బంజారాహిల్స్

మరో హైటెక్‌సిటీగా మహేశ్వరం



మన్సాన్‌పల్లిలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: భారీ పరిశ్రమలతో మహేశ్వరం మరో హైటెక్ సిటీగా మారబోతోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మన్సాన్‌పల్లి చౌరస్తా సమీపంలోని ప్లే గ్రౌండ్‌లో మంగళవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులెవరూ భూములు అమ్ముకోవద్దని సూచించారు. తొమ్మిదేళ్ల క్రితం గ్యాస్ ధర రూ.400 ఉండగా బీజేపీ ప్రభుత్వంలో రూ.1,200కు చేరిందన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి కేంద్రం పేదల నడ్డి విరుస్తోందన్నారు. ప్రజల మీద నిజంగా ప్రేమ ఉంటే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని తెలంగాణ బీజేపీ నేతలు కోరాలన్నారు. తెలంగాణకు ఎలాంటి నిధులు ఇవ్వకుండా, అభివృద్ధికి సహకరించకుండా కార్నర్ మీటింగ్‌లు పెట్టి తెలంగాణ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పదో తరగతి పరీక్షలను బీజేపీ నేతలు రాజకీయాలకు వాడుకొని విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం దళితులకు దళిత బంధు ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందన్నారు. కల్యాణలక్ష్మి ద్వారా రూ.లక్షా నూట పదహారు అందించి పేదింటి ఆడ బిడ్డకు కేసీఆర్ మేనమామలా నిలుస్తున్నారన్నారు. పట్టా పాసు బుక్ కలిగిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.5 వేలు, రెండు పంటలకు రూ.10 వేలు అందిస్తోందన్నారు. ప్రతి రైతు కుటుంబానికి రూ.5 లక్షల బీమా కల్పిస్తోందన్నారు. త్వరలో అర్హత కలిగిన ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు, అర్హులకు పింఛన్లు అందిస్తామని ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పార్టీ శ్రేణులు ఔటర్‌రింగ్ రోడ్డు పెద్ద గోల్కొండ నుంచి మన్సాన్‌పల్లి చౌరస్తా వరకు భారీ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు హన్మగళ్ల చంద్రయ్య, లక్ష్మీనర్సింహారెడ్డి, కార్యదర్శి గుండెమోని అంజయ్య ముదిరాజ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వట్టెల మల్లేశ్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, ప్రధాన కార్యదర్శి మర్యాద రాఘవేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఆనందం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మన్సాన్‌పల్లి సర్పంచ్ కంది అరుణ, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు లచ్చా నాయక్, కల్వకోల్ ఎంపీటీసీ తొంట స్వప్న తదితరులు పాల్గొన్నారు.



'పది'ంతల ఆనందం

సాక్షి, సిటీబ్యూరో: పదోతరగతి వార్షిక పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలతో ఆనందం వ్యక్తం చేశారు. వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. గట్టి బందోబస్తు మధ్య పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. గ్రేటర్ పరిధిలో 590 పరీక్ష కేంద్రాల్లో సుమారు 1.60 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే హైదరాబాద్‌లో మొత్తం 68,939, రంగారెడ్డిలో 47,661, మేడ్చల్–మల్కాజిగిరిలో 43,595 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

ఎల్బీ స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ మళ్లింపులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం బుధవారం ఎల్బీ స్టేడియంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. సీఎం కేసీఆర్ సహా అనేక మంది ప్రముఖులు, అధికారులు, రాజకీయ నాయకులు హాజరుకానున్న నేపథ్యంలో సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు స్టేడియం కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధిస్తూ ట్రాఫిక్ చీఫ్ సుధీర్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మైనారిటీల సంక్షేమానికి కృషి

గన్‌ఫౌండ్రీ: ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తోందని మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ అన్నారు. ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్న ఇఫ్తార్ విందుకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి వారు పరిశీలించారు. ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ పాల్గొన్నారు.

ఫార్మాసిటీతో ఊహించని అభివృద్ధి



రైతులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్

మంత్రి సబితారెడ్డి

- బఫర్ జోన్ బూటకం
- భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల పట్టాల పంపిణీ

కందుకూరు: ఫార్మాసిటీ ఏర్పాటుతో ఊహించని విధంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని మంత్రి సబితారెడ్డి అన్నారు. మండలంలోని ముచ్చర్ల ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు మంగళవారం ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లను జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ఫార్మాసిటీ చుట్టూ బఫర్ జోన్ అంటూ అసత్య ప్రచారాలు చేస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారని అన్నారు. ఇదంతా బూటకమని, అలాంటిది ఏదీ లేదన్నారు. రైతులు భయపడి తక్కువ ధరకు భూములు అమ్ముతారనే పన్నాగంతోనే బఫర్ జోన్ అంటూ కొందరు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని తెలిపారు. అలాంటిది ఏమైనా ఉన్నా ప్రజల పక్షాన సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య తలెత్తకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రపంచంలోనే కాలుష్యం లేని ఫార్మాసిటీ కేవలం హైదరాబాద్‌లోనే ఏర్పాటు కానుందన్నారు. ఫార్మాసిటీతో లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఎకరాకు 121 గజాల చొప్పున అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ప్లాట్లను అదనంగా కేటాయిస్తున్నారని, ఇది సీఎం కేసీఆర్ మీకు ఇస్తున్న బహుమతిగా భావించి పిల్లల భవిష్యత్ కోసం విక్రయించకుండా జాగ్రత్త చేసుకోవాలన్నారు. అంతకుముందు వడ్డెర కులస్తుల కోసం రూ.10 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూరజ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు బీ జంగారెడ్డి, సర్పంచ్ ఈ రాంచంద్రారెడ్డి, ఎంపీటీసీ బీ మల్లేష్, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డీ చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు రామకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, ఎంపీటీసీలు ఇందిర, కే రాములు, డైరెక్టర్లు వెంకట్రామ్‌రెడ్డి, ఆనంద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం జయేందర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

వార్డు మాజీ సభ్యుడి దుర్మరణం



జంగయ్య (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో మాజీ వార్డు సభ్యుడు మృతిచెందిన సంఘటన మంగళవారం బైపాస్ రహదారిపై సోలీపూర్ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాలు.. మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ నేత జంగయ్య(65) బైక్‌పై షాద్‌నగర్‌కు వస్తుండగా బైపాస్ జాతీయ రహదారిపై కర్నూల్‌కు చెందిన వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ విజయ్ ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య జంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. పార్టీలకతీతంగా నేతలు జంగయ్య మృతికి సంతాపం తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తులకు ఘన సన్మానం



షాద్‌నగర్: హైకోర్టు న్యాయమూర్తులు వెంకటేశ్వర్‌రెడ్డి, మాధవిదేవిల వీడ్కోలు కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి షాద్‌నగర్ కోర్టు ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తులను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయవాదులు వారికి పూల బొకేలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి భూపతిరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నర్సింహారెడ్డి, జయప్రకాష్, హన్మంతరెడ్డి, రాజ్యలక్ష్మి, న్యాయవాదులు జగన్‌మోహన్‌రెడ్డి, కంచి రాజ్‌గోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి దుర్మరణం

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి మృతి చెందిన సంఘటన కొండపాక శివారులో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. కుకునూరుపల్లి ఎస్ఐ పుష్పరాజ్ కథనం మేరకు.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, శిల్ప బృందావనానికి చెందిన నూతక్కి నిఖిల్ కరీంనగర్ జిల్లా, చల్మెడలోని ఆనంద్‌రావు మెడికల్ కాలేజీలో హౌస్ సర్జన్ చేస్తున్నాడు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి కాలేజీకి వెళ్తున్నాడు వెళ్తుండగా కొండపాక శివారులో రాజీవ్ రహదారి పక్కన ఉన్న కల్వర్టును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోగుల బాధ్యత వైద్యులదే

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్ టౌన్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డాక్టర్లకు సూచించారు. మంగళవారం షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆపద సమయంలో ఆస్పత్రికి వచ్చే వారికి నాణ్యమైన వైద్యాన్ని అందించాల్సిన బాధ్యత డాక్టర్లపై ఉందన్నారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి అంటే ప్రజలకు నమ్మకం కలిగేలా సేవలు ఉండాలన్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్యం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, శ్రీశైలం గౌడ్, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరికలు

షాద్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నేతలు పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామానికి చెందిన వల్కె శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను చేపడుతున్నారని అన్నారు. తద్వార అభివృద్ధిలో రాష్ట్రం నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. సంక్షేమ ఫలాలు అర్హులైన వారికి అందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు నర్సింలు యాదవ్, చిన్నారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బల్వంత్ యాదవ్, రవి, శ్రీనివాస్, సిరిగిరి వెంకటేష్, మురళీ, మదన్, వంశీ యాదవ్, వెంకటేష్ యాదవ్, శేఖర్, హరీష్, శివ, భాస్కర్ యాదవ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, ఎమ్మె సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాల పట్టిక ఆవిష్కరణ

షాద్‌నగర్: ప్రభుత్వం పాడిరైతుల పెంచిన ప్రోత్సాహకాల ధరలకు సంబంధించిన పట్టికను మంగళవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆవిష్కరించారు. విజయ డైరీ పాలు పోస్తున్న పాడిరైతులకు ప్రభుత్వం ఇటీవల ప్రోత్సాహాలను పెంచింది. ఈ పట్టికలను పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, వీ నారాయణ రెడ్డి, కమిషనర్ వెంకన్న, మిల్క్ చిల్లింగ్ సెంటర్ ఇన్‌చార్జ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న మహిళ

- పొంతన లేని సమాధానాలు
- యాచకురాలి పరిస్థితి విషమం



కాలిన గాయాలతో శివాని

రాజేంద్రనగర్: మతిస్థిమితం సరిగా లేని ఓ యాచకురాలు మంగళవారం ఉదయం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. స్థానికులు మంటలు ఆర్పి పోలీసులకు సమాచారం అందించారు. కాగా.. తన భర్త పెట్రోల్ పోసి నిప్పంటించాడని ఒకసారి, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని మరోసారి.. దుర్గామాత కలలోకి వచ్చి నిప్పంటించుకోమంది అంటూ ఇంకోసారి పొంతన లేని సమాధానాలు చెప్పడం గమనార్హం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిముస్లాయిగూడ సాయిబాబా దేవాలయ ప్రాంతంలో శివాని (38) అనే మహిళ తన తల్లి లక్ష్మి, కూతురు చిట్కీతో కలిసి నివసిస్తోంది. భర్త మృతి చెందడంతో స్థానికంగా భిక్షాటన చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చి పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్ నంబర్ 133 వద్ద రోడ్డు పక్కన శివాని ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. స్థానికులు మంటలను ఆర్పివేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వచ్చిన ఎస్సై శ్వేత బాధితురాలితో మాట్లాడారు. అనంతరం చికిత్స నిమిత్తం ఆమెను 108 వాహనంలో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు మాట్లాడుతూ.. శివానితో తాము స్థానికంగా విచారించామని.. కావాలనే ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుందన్నారు. కొన్ని రోజులుగా శివాని మానసిక పరిస్థితి సరిగా లేదన్నారు. 75 శాతం కాలిన గాయాలతో ఆమె పరిస్థితి విషమంగా ఉందన్నారు.

ప్రణాళికాబద్ధంగా పాత పట్నం అభివృద్ధి

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



కూరగాయల షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: పాత ఇబ్రహీంపట్నం అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా సాగుతున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. పాత పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న వీధి వ్యాపారుల కూరగాయల షెడ్డు పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాత పట్నం వెనుక వైపు ప్రాంతం, నాగన్‌పల్లి, రాయపోల్ రోడ్డులో బీడీయల్, ఎస్ఎస్‌జీ, ఆక్టోపస్, ఎస్‌పీఏ సంస్థలు, వైట్ గోల్డ్ వస్త్ర పరిశ్రమ, కళ్యాణి ఫైబర్ గ్రూప్ కంపెనీలు ఏర్పాటవుతున్నాయని చెప్పారు. తద్వార రానున్న రెండేళ్లల్లో కొత్తగా 5 వేల కుటుంబాలు జీవనోపాధికి ఇక్కడకి వస్తారని తెలిపారు. దీంతో ఈ ప్రాంతానికి పూర్వవైభవం వస్తుందన్నారు. నాగన్‌పల్లి, రాయపోల్ రోడ్ల విస్తరణ పనులు పూర్తి అయితే ఒక వైపు వ్యాపారం, మరోవైపు రోడ్ల అభివృద్ధితో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయన్నారు. అలాగే రూ. 5 కోట్లతో ప్రభుత్వ ఆస్పత్రిని అభివృద్ధి చేస్తామన్నారు. పాత బస్టాండ్ వద్ద సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయిందని త్వరలో పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కొందరి స్వార్థ రాజకీయాల కారణంగా ఈ ప్రాంత అభివృద్ధికి అవరోధం ఏర్పడుతోందన్నారు. దీన్ని ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, కమిషనర్ యూసుఫ్, సింగిల్ విండో చైర్మన్ సుదర్శన్ రెడ్డి, కౌన్సిలర్లు యాచారం సుజాత రవీందర్, మంద సుధాకర్, బీఆర్ఎస్ నాయకులు మంద సురేష్, చిలుకల బుగ్గరాములు, చీరాల రమేష్, భరత్‌కుమార్, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- వివాహేతర సంబంధమే కారణం
- ముగ్గురితో కలిసి ప్రియుడి భార్య ఘాతుకం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: వివాహేతర సంబంధం కారణంగా ఓ మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ వెంకట్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రం, కైన్‌పులియా గ్రామానికి చెందిన ధరిత్రీ సింగ్(22) బతుకుదెరువు కోసం మేడ్చల్‌కు వలస వచ్చింది. డబిల్‌పూర్ చౌరస్తాలోని బనియన్ ట్రీ హోటల్‌లో కార్మికురాలిగా పని చేసేది. అదే హోటల్‌లో మేనేజర్‌గా పనిచేస్తూ స్థానిక వినాయక్‌నగర్-2లో ఉంటున్న షేక్ చాంద్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం వివాహేతర సంబంధానికి దారితీయడంతో ధరిత్రీ సింగ్ గర్భవతి అయ్యింది. దీంతో ఆమె తనను పెళ్లి చేసుకోవాలని షేక్ చాంద్‌పై ఒత్తిడి తెచ్చింది. అప్పటికే అతడి వివాహం జరగడంతో ఈ విషయం చాంద్ కుటుంబసభ్యులకు తెలియడంతో ఇంట్లో గొడవలు జరిగాయి. దీంతో అతను ధరిత్రీ సింగ్‌ను సొంత ఊరికి పంపించాడు. అయితే నెలన్నర క్రితం చాంద్ ఆమెను మళ్లీ నగరానికి రప్పించి రహస్యంగా డబిల్‌పూర్ గ్రామంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంచి ఆమెతో సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలియడంతో చాంద్ భార్య పాకీజా భర్తను నిలదీయడంతో ధరిత్రీ తనను వదలడం లేదని మాయమాటలు చెప్పాడు. దీంతో ఆమె అడ్డు తొలగించుకోవాలని భావించిన పాకీజా అదే హోటల్‌లో పనిచేస్తున్న అజీమ్ షా, దంపతులు, అదే కాలనీలో ఉంటున్న మందాకినికి విషయం చెప్పింది. దీంతో నలుగురు కలిసి ధరిత్రీని హత్య చేయాలని పథకం పన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 9న అజీమ్‌షా, మందాకిని బైక్‌పై ధరిత్రీ సింగ్ ఇంటికి వెళ్లారు. మందాకిని బయటే ఉండి పరిస్థితిని గమనిస్తుండగా అజీమ్‌షా ఆమె ఇంట్లోకి వెళ్లి ధరిత్రీ సింగ్ చేతులు కట్టేసి మెడకు టవల్ బిగించి హత్య చేశాడు. అనంతరం వీరు అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై సమాచారం అందడంతో మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా వివాహేతర సంబంధం వెలుగులోకి వచ్చింది. దీంతో చాంద్, అతని భార్యను అదుపులోకి తీసుకుని విచారించగా నలుగురు కలిసి హత్య చేసినట్లు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

కారు ఢీకొని విద్యార్థిని మృతి

మరో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు

జవహర్‌నగర్: పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులను వేగంగా వచ్చిన కారు ఢీ కొనడంతో ఒక విద్యార్థిని మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్ కార్పొరేషన్, ఫైరింగ్ కట్ట సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న షేక్ అమీనా (14) మరో ఇద్దరు విద్యార్థులతో కలిసి మంగళవారం స్కూల్ నుంచి ఇంటికి వెళుతుండగా మార్కెట్ గల్లీ సమీపంలో వేగంగా వచ్చిన వ్యాగనార్ కారు వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించగా షేక్ అమీనా చికిత్స పొందుతూ మృతి చెందింది, మిగతా ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మృతురాలు అమీనా తండ్రి మునీరుద్దీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

3 నెలల్లో 45 శిక్షలు

సాక్షి, సిటీబ్యూరో: సమష్టి కృషితో పక్కా ఆధారాలు సేకరించి, నేరస్తులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా రాచకొండ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఫలితంగా నేర నిరూపణలో రాష్ట్రంలో రాచకొండ కమిషనరేట్ మొదటి స్థానంలో నిలిచింది. 2020లో 75 శాతం కన్విక్షన్లు రాగా.. 2021లో 79 శాతం, 2022లో 95 శాతంగా కన్విక్షన్ల రేటు ఉందని రాచకొండ పోలీసు కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 45 కేసుల్లో నేర నిరూపణలు జరిగాయని, ఇందులో 4 కేసులలో నిందితులకు యావజ్జీవ శిక్ష పడగా.. 3 కేసుల్లో 20 ఏళ్లు, మరో మూడింటిలో పదేళ్లు, నాలుగింటిలో ఏడేళ్లు, ఐదు కేసులో ఐదేళ్లు, ఏడు కేసుల్లో మూడేళ్లు, 19 కేసుల్లో రెండేళ్ల వరకు నిందితులకు జైలు శిక్షలు ఖరారయ్యాయి. ఆయా కేసులలో నిందితులు శిక్ష పడేలా చేసిన 168 మంది ఆఫీసర్లను సీపీ అభినందించారు. ఇందులో 41 మంది విచారణాధికారులు, 39 మంది కోర్టు డ్యూటీ ఆఫీసర్లు, 32 మంది సమన్స్ ఆఫీసర్లు, 27 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నారు. ఈ సందర్భంగా వారికి రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ సత్యనారాయణ, డీసీపీలు డీ జానకీ, ఎం రాజేశ్ చంద్ర, సీహెచ్ శ్రీనివాస్, సాయి శ్రీ, అదనపు పీడీ డిప్యూటీ డైరెక్టర్ డీఓపీ కస్తూరి, పీపీ జాయింట్ డైరెక్టర్ డీఓపీ రాము, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల్లో అగ్రగామి ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల్లో ఓయూ అగ్రగామిగా ఉందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఇంజినీరింగ్ కళాశాలలో బాలుర కోసం రూ.39.50 కోట్ల వ్యయంతో చేపట్టిన హాస్టల్ భవన నిర్మాణానికి హోంమంత్రి మహమూద్ అలీ, వీసీ ప్రొ.రవీందర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. రాష్ట్ర అవతరణ అనంతరం విద్యా వ్యవస్థ స్వరూపమే మారిందన్నారు. సంప్రదాయ, టెక్నికల్ కోర్సులతో పాటు వెటర్నరీ, వ్యవసాయ, వైద్య కోర్సులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. విభిన్న రంగాల్లో ఆణిముత్యాలను అందించిన ఓయూ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. వర్సిటీలో ఉన్నత విద్యా కోర్సుల్లో మహిళల సంఖ్య 75 శాతానికి చేరుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 105 వసంతాలు పూర్తి చేసుకున్న ఓయూ అభివృద్ధికి ముఖ్యమంత్రి ఏటా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు పెంచుతున్నారని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. నూతన భవనంతో ఓయూలో హాస్టళ్ల సంఖ్య 30కి చేరుకుందని త్వరలో ట్రైబల్ వెల్ఫేర్ సహకారంతో మరో రెండు కొత్త హాస్టల్ భవనాలను నిర్మించనున్నట్లు వీసీ ప్రొ.రవీందర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఈడబ్ల్యూఐడీసీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఇంజినీరింగ్ హాస్టల్ భవనం పది నెలల్లో అందుబాటులోకి రానున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ తెలిపారు. నూతన హాస్టల్ భవనంతో 500 మంది విద్యార్థులకు వసతి లభిస్తుందని ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాకు చెక్

ఏడుగురు నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ చక్రవర్తి

చాంద్రాయణగుట్ట: గంజాయి రవాణాకు పాల్పడుతున్న కేసులో ఏడుగురు నిందితులను బహదూర్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పురానీహవేలీలోని తన కార్యాలయంలో మంగళవారం హెచ్-న్యూ(హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్) డీసీపీ గున్ని చక్రవర్తి వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా, మహబూబాబాద్‌కు చెందిన తేజావత్ కోటేష్ గత కొన్నేళ్లుగా ఏపీలోని సీలేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి మంగళహాట్‌కు చెందిన పెద్దర్ల రాకేష్ సింగ్, బజరంగ్ సహకారంతో నగరంలో విక్రయించేవాడు. అయితే ఇటీవలి కాలంలో పోలీసుల నిఘా తీవ్రం కావడంతో వ్యాన్‌ను కొనుగోలు చేసిన అతను అందులో గంజాయి సరఫరాకు అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశాడు. సీలేరుకు చెందిన పంగి పందన్న, కొర్ర సీతారాం, కొర్ర సుబ్బన్న, పంగి కృష్ణమూర్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి మంగళహాట్ ప్రాంతానికి తరలించేవాడు. ఒక్కోసారి ఒడిశా నుంచి కూడా అక్రమ రవాణా చేసేవాడు. మంగళవారం వారు బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో బహదూర్‌పురా, హెచ్-న్యూ పోలీసులు దాడులు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 80 కిలోల గంజాయి, ఆరు సెల్‌ఫోన్లు, ఒక ట్రాలీ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గతంలో గంజాయి అక్రమ రవాణా కేసులు ఉన్నట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో ఏసీపీ షేక్ జహంగీర్, ఇన్‌స్పెక్టర్లు పి.రాజేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.